క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు

పాలసముద్రం : పరిసరాల శుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని బలిజకండ్రిగ హైస్కూల్ హెచ్‌ఎం రఘు, పాలసముద్రం ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. శనివారం ఆయా పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి


లార్వా సర్వే చేస్తున్న జిల్లా మలేరియా అధికారి

నింద్ర: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతీ శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని ఇరుగువాయి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

విజేతలకు బహుమతి ప్రదానం


విజేతలతో ఎంఈవో నమశ్శివాయం

నగరి: స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఎంఈవో నమశ్శివాయం బహుమతులు అందజేశారు. పీసీఎస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మండలస్థాయిలో విజేతలైన విద్యార్థులను ఆయన ప్రశంసిస్తూ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు గణేశన్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

నగరి: మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

20 పోలింగ్ కేంద్రాల మార్పు

నగరి: నియోజకవర్గంలో గత ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన బూత్‌లలో వసతులు సరిగా లేని కారణంగా 20 పోలింగ్ బూత్‌లను మార్పు చేస్తున్నట్లు ఆర్డీవో వెంకటరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ఆయన ఈ అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పెరటాశి పూజలు

నగరి: పెరటాశి నెలలో వచ్చే శనివారం ప్రత్యేకం కావడంతోపాటు ఏకాదశి కూడా రావడంతో శనివారం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలో పూజాసామగ్రి విక్రయాలకు ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. టీటీడీ ఆధీనంలో ఉన్న నగరి పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం, సత్రవాడలోని కరివరదరాజ స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు.

న్యాయం చేయాలని మహిళల నిరసన



నింద్ర: మండలంలోని నింద్ర గ్రామానికి చెందిన మహిళ సంఘం గ్రూపు సభ్యుల వివాదంపై మహిళలు నిరసన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న నగరి రూరల్ సీఐ భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని మహిళలను సర్ది చెప్పారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు రాధమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నింద్రలో శ్రీవెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు, పుత్తూరు: వడమాలపేట ఆంజనేయస్వామి ఆలయంలో.., కార్వేటినగరం: ద్రౌపదీదేవి ఆలయంలో.., గంగాధర నెల్లూరు: అల్లియల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు






స్వామీ.. బాబుకు మంచి బుద్ధి ప్రసాదించు

నగరి: స్వామీ... చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు అంటూ మండలంలోని నాయకులు టీటీడీ ఆధీనంలో ఉన్న బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు పాపాల్ని ప్రక్షాళన చేసేందుకు వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆలయ పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ తిరుమల లడ్డూలపై అనవసర ఆరోపణలు చేసి అపవిత్రం చేసిన చంద్రబాబుకు భగవంతుడు మంచి బుద్ధి ప్రసాదించాలన్నారు. రాష్ట్రానికి ఎలాంటి అరిష్టం రాకుండా భగవంతుడు కాపాడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవిభాస్కర్, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్‌లు చంద్రకళ, నాయకులు తిరుమలరెడ్డి, లీలారామ్, ఏలుమలై రెడ్డి, యేసు, పరంధామరెడ్డి, అరుణాచలం, దామునాయుడు, ఉమాపతి, రామ్మూర్తి, కృష్ణారెడ్డి, క్రిష్ణన్, గోవర్ధనం, రంగనాథం, రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.


నగరి: బుగ్గదేవాలయం వద్ద పూజలు


పుత్తూరు: ఆరేటమ్మ ఆలయంలో పూజలు

నింద్రలో...

నింద్ర: మండలంలో శనివారం వైఎస్‌ఆర్ సీపీ ఆదేశాల మేరకు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఉదయం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అరూరు, అత్తూరు గ్రామల్లో కూడా నాయకులు పూజలు చేపట్టారు. ఎంపీపీ దీప, కోఆప్షన్ సభ్యుడు అనిల్, వైస్ ఎంపీపీ శుశ, ఎంపీటీసీ విజేష్, సర్పంచ్ బాబురెడ్డి, వేణురాజు, సుబ్రమణ్యం యాదవ్, మునిరాజ్, శివయ్య, జలంధర్ రాజు, రామచంద్రారెడ్డి, సత్యరాజ్ పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: చంద్రబాబు పాపాలు పండాలని కోరుతూ పుత్తూరు మండలంలోని వైఎస్‌ఆర్ సీపీ నేతలు శనివారం పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్థానిక ఆరేటమ్మ ఆలయంలో మున్సిపల్ చైర్మన్ హరి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయానికి అప్రతిష్ట మూటగట్టిన చంద్రబాబుకు మంచి బుద్ధి ఇవ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు వనిత, షకీలా, బాలాజీ, చిట్టిబాబు, నాయకులు మనోహర్‌రెడ్డి, లారీమోహన్, మోహన్‌రెడ్డి, కార్తికేయన్, లక్ష్మణమూర్తి, శివ, మునయ్య, శివయ్య, ప్రభు, కడియాలనాయుడు, తిరునావుక్కరసు, మునిరత్నం, చిన్నా, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట: ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం వైఎస్‌ఆర్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సురేష్‌రాజు, నందయ్య, వెంకట్‌రెడ్డి, చంద్ర, వేణు, అంజేరప్ప, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు: తిరుమల మహా ప్రసాదం లడ్డూలో కల్తీ జరిగిందటూ అసత్య ఆరోపణలు చేస్తున్న కూటమి నేతలను ఆ దేవుడే శిక్షిస్తాడంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం ఉదయం వారు కలిగిరికొండలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామసాని విజయకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు జి.దొరస్వామి యాదవ్, నాయకులు కె.గోవిందరెడ్డి, బండి కమలాకరరెడ్డి, కండిగ మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కె.మహేష్, లక్ష్మిపతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చవటగుంటలోని ద్రౌపదీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసమర్థత, చేతగానితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేస్తున్నట్లు మండిపడ్డాడు. ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రామయ్య, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ, సర్పంచ్ గోవిందయ్య, నాయకులు పెద్దిరెడ్డి, గురవారెడ్డి, రోశిరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష సాధింపుతో కల్తీ నెయ్యి అంటూ రాజకీయ చేస్తున్న సీఎం చంద్రబాబుకు దేవుళ్లు సద్బుద్ధిని ప్రసాదించాలని మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీద్రౌపదీ అమ్మవారి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, నాయకులు లోకనాథరెడ్డి, పురుషోత్తంరాజు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మహిళా అధ్యక్షురాలు మోహనకుమారి, పట్టణ అధ్యక్షుడు శివ ప్రకాష్‌మొదలియార్, మున్నా, లోకనాథనాయుడు, దొరస్వామి, మునికృష్ణ, మురగయ్య, గోపి, ఆశీర్వాదం, శేఖర్, పయణిరెడ్డి, ధనశేఖర్‌యాదవ్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: స్థానిక మండల కేంద్రంలోని అల్లిఎల్లమ్మ ఆలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మునిరాజారెడ్డి, మాజీ గ్రీనింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, నాయకులు వెంకటరెడ్డి, చిన్నమ్మ రెడ్డి, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి కుట్ర రాజకీయాలు

పాలసముద్రం : ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్నశగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ ఆరోపించారు. శనివారం వారు పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ అయ్యప్ప, లిల్లీఆనంద్, అనురేఖ, నాయకులు యువరాజ్, రవి, గోపాల్, షణ్ముగరెడ్డి, సుందరరాజు, రాజేంద్రప్రసాద్, ప్రకాష్, పయణి, రవిరెడ్డి, ధనుంజయరెడ్డి, లోకిదాస్, వెంకటేష్ మందడి, సుబ్రమణ్యం, తిరుమల, ఆనందన్, మేఘవర్ణం, లక్ష్మణరెడ్డి, సత్యరాజ్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : తిరుమల లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేసే వారిని శిక్షించాలని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ఆరిమాని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మణి ఎంపీపీ సరిత, జనార్ధన్, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, సర్పంచ్ దామునాయుడు, నాయకులు కాలప్ప, మణి, బాబు, అల్లిముత్తు, లోకయ్య, హరిరెడ్డి, జయ, రామకృష్ణ, మహేష్, ఆనంద్, మార్కొండయ్య, మునికృష్ణ, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.


పెనుమూరు: కలిగిరికొండలో..


వెదురుకుప్పం: పూజలు చేస్తున్న నాయకులు


శ్రీరంగరాజపురం : శ్రీఆరిమాని గంగమ్మ ఆలయంలో ..


పాలసముద్రం : మాట్లాడుతున్న నాయకులు

ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి

నగరి: ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు శనివారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. తెరణి గ్రామం వద్ద కుశస్థలి నది నుంచి ఇసుక తరలిపోతోందని, దానికి అడ్డు కట్టవేయాలన్నారు. ఇసుక తరలింపు ఆగకుండా నిరంతరం అక్రమ రవాణా జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులు ఈ తరలింపును అరికట్టాలన్నారు. గతంలో వేలాది మంది పవర్‌లూమ్ కార్మికులు కూలీ రేటు పెంచాలని పోరాటం చేశారని, దానికి ఫలితం దక్కలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు చేస్తామన్నారు. సీపీఎం నాయకులు పెరుమాళ్, తంగరాజు, మైల్ స్వామి, షణ్ముగం పాల్గొన్నారు.

ఎస్‌ఐ బలరాంని కలిసిన వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

విజయపురం: ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన బలరాంను శనివారం వైఎస్‌ఆర్ సీపీ నాయకులు హరినాయుడు, సురేష్ కలిసి దుశ్శాలువాలతో సన్మానించారు. ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.


ఎస్‌ఐని సన్మానిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నేతలు

వంక కాలువలో కొత్త రోడ్డా..?

- అసిస్టెంట్ కలెక్టర్‌కు మాంబేడు గ్రామస్తుల మొర


చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

వెదురుకుప్పం: గతంలో రూ.15 లక్షలతో నిర్మించిన రోడ్డును కాదని ఇప్పుడు వర్షపు నీరు ప్రవహించే వంకలో మరో కొత్త రోడ్డు వేయాలని కూటమికి చెందిన నేతలు ప్రయత్నిస్తున్నారని మండలంలోని మాంబేడు గ్రామస్తులు అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీకి ఫిర్యాదు చేశారు. రోడ్డు విషయమై ఇటీవల కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం అసిస్టెంట్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ రమేష్‌బాబు, సర్వేయర్ భానుమతి, సచివాలయ సిబ్బంది కలిసి గ్రామాన్ని సందర్శించారు. వర్షపు నీరు పారుతున్న వంకలో కొంతదూరం నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. రోడ్డు విషయమై రైతులను అడిగారు. వారు స్పందిస్తూ గతంలో సీజేఎఫ్‌ఎస్ భూముల వరకు వెళ్లేందుకు మూడేళ్ల కిందట కొత్తగా మండల నిధులతో నిర్మించారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రూ.15 లక్షలతో కొత్త రోడ్డును అందరికీ అనుకూలంగా నిర్మించారని, ఇప్పుడు కేవలం కొందరు తమ స్వలాభం కోసం వంకలో రోడ్డు వేయాలని ప్రయత్నించడం సహేతుకం కాదన్నారు. కొత్తరోడ్డు నిర్మించాలంటే వంకకు ఆనుకుని ఉన్న రైతులకు సంబంధించి సెటిల్‌మెంట్ భూములు ఉన్నాయని, కొత్త రోడ్డు వేయడానికి రైతులు ససేమిరా అంటున్నారని వివరించారు. దీనికితోడు వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబు కేవలం బంధుప్రీతితో జనసేనకు చెందిన వారికి అండగా నిలుస్తున్నారే తప్ప భవిష్యత్‌లో జరిగే నష్టాలను అంచనా వేయడం లేదని, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి కోరారు. అంతకుముందు రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

చెరువు ఆక్రమణలను తొలగించండి..

మాంబేడు గ్రామానికి సమీపంలోని నాగాలమ్మ గుడి వద్ద ఉన్న సిద్దారెడ్డి చెరువును కొందరు కబ్జా చేశారని అసిస్టెంట్ కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువు 8.4 ఎకరాల విస్తీర్ణం ఉందని అయితే కొందరు ఆక్రమించుకోవడంతో కుచించుకుపోయినట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చెరువులో వర్షపు నీళ్లు పుష్కలంగా ఉంటే చుట్టు పక్కల ఉన్న రైతులకు చెందిన భూముల్లో పంటల సాగుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, స్పందించి చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు.


వంక కాలువను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అధికారులు

ప్రత్యేక నిఘా పెట్టండి


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ

శ్రీరంగరాజపురం : మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మన రాష్ట్ర సరిహద్దు నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా ఎర్రచందనం, కలప, బియ్యం, ఇసుక రవాణా, సారాయి, గ్రానైట్ తమిళనాడుకు తరలిపోతున్నాయని అన్నారు. రాత్రివేళ ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని శాంతి భద్రతలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ, సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల డీటీగా మోహన్‌రాజ

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుగా మోహన్‌రాజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలెక్టరేట్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విజయకృష్ణ చిత్తూరు రూరల్ మండలానికి డీటీగా బదిలీ అయ్యారు.

మండల సర్వేయర్‌గా సునీత

గంగాధర నెల్లూరు: మండల సర్వేయర్‌గా సునీత బాధ్యతలు స్వీకరించారు. ఆమె చిత్తూరు మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మండల సర్వేయర్ గణేష్ గుడిపాలకు బదిలీ అయ్యారు.

రాష్ట్ర జూడో పోటీలకు వడమాలపేట విద్యార్థులు

పుత్తూరు: స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా శనివారం తిరుపతి శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన అండర్-19 జిల్లా స్థాయి జూడో, రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జడ్పీహెచ్‌ఎస్ క్రీడాకారులు విజేతలుగా నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. జూడో పోటీలలో 10వ తరగతికి చెందిన జాహ్నవి 36 కేజీల విభాగంలో, భవిత 40 కేజీలు, చిన్మయి 44 కేజీల విభాగంలో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 రెజ్లింగ్ పోటీల్లో 10వ తరగతికి చెందిన వరుణ్ 80 కేజీల విభాగంలో సత్తా చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజేతలుగా నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించాలని ఆకాంక్షించారు.


రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ చంద్రశేఖర్‌రాజు

అక్షర పోరాట యోధుడు జాషువా


మాట్లాడుతున్న మన్యం నరసింహులు

పుత్తూరు: సామాజిక అసమానతలపై రచనా పోరాటం చేసిన యోధుడు గుర్రం జాషువా అని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య పేర్కొన్నారు. శనివారం కళాశాలలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకుడు మన్యం నరసింహులు మాట్లాడుతూ జాషువా రచనల్లో దేశారాధన ఉట్టిపడుతుందని తెలిపారు. తన రచనల ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. జాషువా పద్యాలు పాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశన్, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలి

వెదురుకుప్పం: స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పచ్చికాపల్లంలో డంపింగ్ యార్డు వద్ద పిచ్చిమొక్కలను తొలగించి జేసీబీ ద్వారా చదును చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఓ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.


డంపింగ్‌యార్డు వద్ద శుభ్రం చేస్తున్న అధికారులు

సర్వసభ్య సమావేశంలో రచ్చరచ్చ

- పీఆర్ ఏఈని నిలదీసిన సర్పంచ్, ఎంపీటీసీలు
- సర్పంచ్ రిజల్యూషన్ లేకుండా పనులు


పీఆర్‌ఏఈని ప్రశ్నిస్తున్న సర్పంచ్ కుమార్

విజయపురం: సర్పంచ్ రిజల్యూషన్ లేకుండ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ఎలా చేస్తారని, కనీసం సమాచారం ఇవ్వకపోవడానికి కారణం ఏమిటని సర్పంచ్‌లు పీఆర్ ఏఈను నిలదీశారు. దీంతో శనివారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం రచ్చరచ్చగా ముగిసింది. ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి వైస్ ఎంపీపీ బాలాజీ అధ్యక్షత వహించారు. అధికారులు అభివృద్ధి, ప్రస్తుతం జరుగుతున్న పనులపై నివేదికలు అందించారు. రానున్న రబీకి అవసరమైన ఎరువులు స్థానిక ఆర్‌బీకేలలో అందుబాటులో ఉన్నాయని ఏఈ రజినికుమారి అన్నారు. బీపీ రాకుండా ముందస్తు చర్యలో భాగంగా ప్రస్తుతం వ్యాక్సిన్ వేస్తున్నామని, దీర్ఘకాల వ్యాధితో బాధపడేవారు తప్పని సరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై రభస

గ్రామాల్లో జరిగే ఎన్‌ఆర్‌జీఎస్ పనులపై సర్పంచ్‌లకు ఎలాంటి సమాచారం లేదని పన్నూరు సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ రాజగోపాల్ ప్రశ్నించారు. మండలంలో మొత్తం 29 సిమెంట్ రోడ్డు పనులు మంజూరు కాగా, నిధులు రూ.99.4 లక్షలు మంజూరయ్యాయి. ఈ విషయం ఇంత వరకు సర్పంచ్‌లకు తెలియకుండ, అధికార పార్టీ నాయకులకు పనులు ఎలా ఇస్తారని పీఆర్ ఏఈని ప్రశ్నించారు. నాణ్యమైన కాంట్రాక్టర్లను గుర్తించి, వారితో పనులు చేయిస్తే తాము కూడా సహకరిస్తామని, అధికారం ఉందని టీడీపీ నాయకులకు అప్పగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ సర్పంచ్ అనుమతి లేకుండా సిమెంట్ రోడ్డు పనులు జరగవని, తప్పకుండా అనుమతి తీసుకుంటామని చెప్పడంతో రచ్చ సద్దుమణిగింది. ఏవో రమణప్రకాష్, ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్, కోఆప్షన్ మెంబర్ రాజేంద్రన్, ఎంపీటీసీ అంబిక తదితరులు పాల్గొన్నారు.